శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 18 ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 24931క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో49.066టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50,ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.143మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# మంత్రి లోకేష్ పర్యటనలో ఎంపీ వేమిరెడ్డి

- కేంద్ర మంత్రులను కలిసిన విపిఆర్



**నెల్లూరు రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త** రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసేందుకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా పార్లమెంట్ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర ఎంపీలతో నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. కేంద్రమంత్రులు జైశంకర్, జేపీ నడ్డాలతో సమావేశం అయ్యారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీని కూడా మంత్రి లోకేశ్ కలిశారు. బీపీసీఎల్ రిఫైనరీ త్వరితగతిన నిర్మించేందుకు సహకారం అందించాలని కోరారు. ఓఎన్జీసీకి చెందిన జాక్ ఆఫ్ రిగ్ కాంట్రాక్టు సాధనకు సహకరించాలని కోరారు. ఏపీలో దీపం2 పథకానికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో లోకేశ్ సమావేశమై పలు రహదారుల విస్తరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నిర్మలా సీతారామన్‌ను కలిశారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్, ఎంపీల బృందం ఆర్థిక ఇబ్బందుల నుంచి రాష్ట్రం గట్టెక్కేందుకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా శాఖల పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు చేయాల్సిన సహాయం, ప్రాజెక్టుల పై లోకేష్ చర్చలు జరిపారు. కేంద్రమంత్రులు సర్బానంద సోనోవాల్, అశ్వనీ వైష్ణవ్ గారిని కలిసిన లోకేష్, ఎంపీల బృందం వివిధ రైల్వే ప్రాజెక్టుల విషయమై సుధీర్ఘంగా చర్చించారు.

## సచివాలయంలో మంత్రులు ఆనం, నారాయణ భేటీ



**నెల్లూరు, ఆగష్టు 18, ప్రభాతవార్త –వైద్యం** మంత్రి ఆనం ఛాంబర్‌లో భేటీ అయిన ఇరువురు మంత్రులు. నెల్లూరు జిల్లాకు సంబంధించిన రాజకీయ, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు మధ్య చర్చ.

## సంగమేశ్వర స్వామి ఆలయానికి సుమారు

5లక్షల 60వేల విలువైన బంగారు బహుకరణ





**సంగం ఆగష్టు 18 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగమేశ్వరుని స్వామి ఆలయానికి సుమారు 5 లక్షల 60 వేల రూపాయాలు విలువైన 49 గ్రామాలు బంగారాన్ని కోటు సుధాకర్‌రెడ్డి,వాయుసుత దంపతులు బహుకరించారు. కోటు కరుణాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆ బంగారాన్ని ఆలయ ఇఒ రఘురామయ్యకి అందజేశారు. ఈకార్యక్రమంలో వేమా మల్లికార్జున, ఆలయ అర్చకులు గోపాలకృష్ణ మూర్తి ఉన్నారు.

## ఆలయ నూతన చైర్మన్ ల ప్రమాణస్వీకారంలో పాల్గొన్న : ఎమ్మెల్యే





**అల్లూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** అల్లూరు మండలం నార్త్ మోపూరులోని శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో రేబాల కోదండరామిరెడ్డి చారిటీస్ నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా రేబాల కిషోర్ కుమార్ రెడ్డి. మరియు కమిటీ సభ్యులు. ఇందుపూరు గ్రామంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా గుణపాటి ప్రవీణ్ కుమార్ రెడ్డి మరియు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగు మాటి వెంకట కృష్ణారెడ్డి. వేమిరెడ్డి కోటారెడ్డి. పాల్గొన్నారు. ముందుగా శాసనసభ్యులు వెంకటకృష్ణారెడ్డి కి పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో వేద పండితులు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. తదుపరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నార్త్ మోపూరు. ఇందుపూరు గ్రామాల్లో ఆలయ నూతన కమిటీ చైర్మన్ లు. ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శాసనసభ్యులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాసనసభ్యులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆలయ కమిటీ చైర్మన్ లు మరియు కమిటీ సభ్యులు దేవస్థానాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి. టిడిపి సీనియర్ నాయకులు బీద గిరిధర్. రెబాల శంకర్ రెడ్డి. పలగాటి శ్రీనివాసులు రెడ్డి. అంబటి రాజేంద్ర. ఎందేటి హరికృష్ణ టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 24వ డివిజన్ కు మౌళికవసతులు కల్పించాలి



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 18,ప్రభాతవార్త :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 24వ డివిజన్ లోని ప్రాంతాల్లో మౌళికవసతులు కల్పించాలని కోరుతూ స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు ఉడతా మురళి యాదవ్ ,కొందరు స్థానిక ప్రజలు సోమవారం. కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో కమిషనర్ హెల్త్ ఆఫీసర్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉడతా మురళి మాట్లాడుతూ మా 24వ డివిజన్ లో పలు సమస్యలు పై ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే డ్రైన్లు బాగా పూడి పోయాయని, అదేవిధంగా రోడ్డు కు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెద్దవిగా ఉన్నందున మురుగు ఎక్కువగా చేరి విష సర్పాలు ఎక్కువై అటు మహిళలు ఇటు పెద్ద వాళ్ళు పిల్లలు వృద్ధులు భయబ్రాంతులకి గురివుతున్నారన్నారు. శానిటేషన్ సిబ్బందిని పెంచి శుభ్ర పరచవలసిందిగా కోరారు. రానున్న రోజులలో వర్షాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడవలసిన బాధ్య త కార్పొరేషన్ అధికారులపై ఉందన్నారు. మా ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 24 గడి నాగరాజు, వడ్లపూడి పెంచలయ్య, కంట్లం ప్రేమాకుమార్, అద్దంకి జగన్ మోహన్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

# సకాలంలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం - కలెక్టర్ ఆనంద్

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 426 అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌వో హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, జిల్లా పంచాయతీ అధి కారి శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యల పై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్య లు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 426 అర్జీలు**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 426 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 129, మున్సిపల్‌శాఖకు సంబంధించి 31, సర్వేకు 34, పంచాయతీ రాజ్ శాఖకు 57, పోలీసుశాఖకు 79, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 7 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాణికి బెయిల్

- నేడు విడుదలయ్యే అవకాశం



**నెల్లూరు క్రైం, ఆగష్టు 18, ప్రభాతవార్త :** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హై కోర్టు బెయిలు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. రుస్తుం మైనులో అక్రమ మైనింగ్ చేపట్టారంటూ అయన పైన కేసు నమోదైంది. కేసులో అరెస్టు అయిన కాకాణికి, షరతులతో కూడిన బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు అయిన కాకాణి గోవర్ధన్ రెడ్డి గత 80 రోజుల పైబడి రోజులుగా నెల్లూరు జైల్లోనే ఉన్నారు. ఆయనపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. అన్ని కేసుల్లో బెయిల్ వచ్చినా.. మైనింగ్ కేసులో మాత్రం ఈరోజే బెయిల్ వచ్చింది. సాంకేతికంగా ఆయన రేపు జైలు నుంచి బయటకు రానున్నారు. అయితే కాకాణి గోవర్ధన్ రెడ్డి పాస్‌పోర్ట్ కోర్టుకు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మాజీ మంత్రిపై నమోదైన 8 కేసుల్లో ఏడింటిలో ఇప్పటికే బెయిల్ రాగా మొదటగా నమోదైన మైనింగ్ కేసులో చివరగా బెయిల్ రావడం గమనార్హం.

## ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిని మర్యాదపూర్వంగా కలిసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఈ మేరకు ఆయన కార్యాలయంలో ఇతర ఎంపీలతో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. అంతకుముందు ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. రాధాకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు జేపీ నడ్డా పిలుపునిచ్చిన నేపథ్యంలో కూటమి ఎంపీలు ఈ సందర్భంగా రాధాకృష్ణతో భేటీ అయ్యారు.

## ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** జిల్లాలో ఆధార్ కార్డులు లేని ఎస్టీ వారికోసం సెప్టెంబర్ 1 నుండి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పనులు, ఎస్టీలకు ఆధార్ కార్డుల మంజూరు మొద్కలైన అంశాలపై సబ్ కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహాశీల్దార్లు, ఆయాశాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్టీలకు మండల స్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించడం ద్వారా ఇప్పటివరకు 6000 మందికి పైగా ఆధార్ కార్డులు మంజూరు చేసామని తెలిపారు. ఇంకా మిగిలిన వారి కోసం సెప్టెంబర్ 1 నుండి నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. అదేవిధంగా పి జి ఆర్ ఎస్‌లో తరచుగా పునరావృతమయ్యే దరఖాస్తులను పరిశీలించేందుకు మండల స్థాయి కోఆర్డినేషన్ కమిటీలను నియమించామన్నారు. మండల స్థాయిలోని తహసిల్దార్, ఎంపీడీవో, పోలీస్ అధికారులు సమన్వయంతో ఆయా దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే సిటిజన్ ఫీడ్‌బాక్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి వుందన్నారు. ముఖ్యంగా ఆప్షన్ 3 నుండి అప్షన్ 1, 2 లకు మారేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్‌లో ఉపాధిహామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఎపివోలు ఉపాధిహామీ పనిదినాలను పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. పాఠశాలల్లో మంచినీటి ఆర్ ఓ ప్లాంట్ లను ఉపయోగంలోకి తీసుకురావలసిందిగా ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో వ్యవసాయేతర అవసరాలకు యూరియాను ఉపయోగిస్తున్నట్లయితే అటువంటి సమాచారాన్ని వెంటనే జిల్లా వ్యవసాయ అధికారికి తెలియజేయాలన్నారు. అలాగే ఈ క్రాపు బుకింగ్ చేయడంలో వ్యవసాయ అధికారులకు వీఆర్వోలు, సర్వే యర్లు సహకరించే విధంగా తహసిల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందుకనుగుణంగా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డిఆర్ఓహుస్సేన్ సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్ రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్ఈ విజయన్, డి పి ఓ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయండి : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 18,ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలు, అనుమతులను మించి నిర్మించిన కట్టడాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని కమిషనర్ వై.ఓ నందన్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు ప్రభలే అవకాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలకు అడ్డంకిగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను, ఆక్రమణలను అన్ని డివిజన్లలో తప్పనిసరిగా తొలగించి ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. నగరవ్యాప్తంగా చికెన్ షాపుల వద్ద లోడింగ్ అన్లోడింగ్ ప్రక్రియలో వ్యర్థాలు రోడ్లపై పడకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించామని, సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్టగేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. రెవెన్యూ విభాగం నుంచి అసెస్మెంట్ మార్పులు, నూతన ఇంటిపన్ను దరఖాస్తులు, ఇంటి పన్నులో మార్పులు తదితర అంశాలపై ఫిర్యాదులు అందుకున్నామని తెలిపారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్ 6, హౌసింగ్ 13, టౌన్ ప్లానింగ్ 10, రెవెన్యూ 5, పబ్లిక్ హెల్త్ 8, ఆప్కాస్ 1, అకౌంట్ సెక్షన్ 2, అడ్మినిస్ట్రేషన్ 1, పెన్షన్ 3, మొత్తం 49 ఫిర్యాదు లను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఈ.ఈ శేషగిరిరావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, ఇతర అన్ని విభాగాల సెక్రెటరీశ్రీలక్ష్మి,టి.పి.ఆర్.ఓవాసు బాబు అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మదేవి నారాయణ రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించిన విద్యాసంస్థల డైరెక్టర్ గంట రవితేజ





**నెల్లూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త–విద్య :** బ్రహ్మదేవినందు గల నారాయణ రెసిడెన్షియల్ కళాశాలను సోమవారం నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ గంట రవితేజ సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను ల్యాబ్ లను, భోజన గదులను, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారికి చదువుతోపాటు, యోగ, వివిధ రకాల క్రీడలలో, ఇతర నైపుణ్యాలలో ప్రావీణ్యం సంపాదించేలా శిక్షణ నివ్వాలని సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఏజీఎం మల్లు శ్రీనివాసులు రెడ్డి, డీన్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణరెడ్డి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

## కరేడు రాంప్ వద్ద రైతు, ప్రజా సంఘాల నాయకుల అక్రమ అరెస్టులను ఖండించండి



**ఉలవపాడు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం ఛలో కరేడు కార్యక్రమానికి తరలిస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులను కరేడు రాంప్ వద్ద అక్రమంగా అరెస్టు చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సీఎస్ సాగర్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కే.నాంచార్లు, ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఆర్.మోహన్ అధికారులను డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారిని ఉలవపాడు, కందుకూరు, వలేటివారిపాలెం తదితర పోలీసు స్టేషన్లకు బలవంతంగా తరలించారని, అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిలో పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎల్.రాజశేఖర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నల్లమడ రైతు సంఘంరాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరావు తదితరులు ఉన్నారు. వారందరిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు నిర్బంధాన్ని ఎదిరించి ఛలో కరేడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కరేడు ప్రజలకు అభినందనలు తెలియజేశారు.

## వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి డాక్టర్ బిజిత డిప్యూటీ డి.యం.హెచ్.ఒ



**కావలి,ఆగస్ట్ 18, ప్రభాత వార్త:** 18 08 2025 డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో కావలి ఇందిరా నగర్ అంగనవాడీ కేంద్రంలోని పిల్లలకు విద్యాసామగ్రి, గర్భవతులకు, బాలింతలకు ఐరన్,పోలిక్, కాల్సియం సిరప్ లు పంపిణీ జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా డిప్యూటీ డి.యం.హెచ్.ఒ. డాక్టర్ బిజిత మాటాడుతూ గర్భవతులు, బాలింతలు వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలని, మీ బాలలు ఆరోగ్యంగా వుండడానికి వ్యాక్సిన్ తప్పకుండా వేయించాలన్నారు.ఈకార్యక్రమంలో వెంగళరావు నగర్ పి.హెచ్. సి వైద్యులు మహేష్, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, పి.హెచ్. సి కమ్యూనిటి ఆర్గనైజర్ ప్రసాద్, అంగనవాడీ టీచర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** ప్రాథమిక దశ నుంచే ప్రతి విద్యార్థి స్వయం ఉపాధి రంగాలపై అవగాహన చేసుకుంటే భవిష్యత్తులో వారికి అవి ఉపయోగపడతాయని జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ బి. మల్లికార్జునరావు అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయితో ఒకేషనల్ కోర్సులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యార్థుల కొరకు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, బేకరి, వంటి స్వయం ఉపాధి రంగాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఒకేషనల్ కోర్సు పథకాన్ని 2016లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ స్వయం ఉపాధి ఒకేషనల్ కోర్సులపై మరింత అవగాహన చేసుకుని పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయడం జరుగుతుందని, భవిష్యత్తులో వారికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో 50 ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ప్రస్తుతం వీటిని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, గీతామాధురి ఉన్నారు.

## కులధృవీకరణ పత్రాలమంజూరు ప్రక్రియ సెప్టెంబర్ 15లోపు పూర్తిచేయాలి

**మర్రిపాడు , ఆగస్టు18,ప్రభాతవార్త :** మర్రిపాడు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు మండలంలో ఇప్పటివరకు మ్యాప్ కాని కుల జాబితా 6572 మంది ఉన్నారని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి వారి లాగిన్‌కు బదిలీ చేయాలని జాబితాలోని వ్యక్తులకు సుమోటుగా కుల ధృవీకరణ పత్రాలను సెప్టెంబర్ 15లోపు జారీ చేయాలని తహసిల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ రెవెన్యూ అధికారులు జాబితాలో ఉన్నప్రతిఒక్కరిని సంప్రదించి వారి వివరాలను తమ లాగిన్‌లో నమోదు చేసి అనంతరం మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ లాగిన్‌కి, ఆపై తహసిల్దార్ లాగిన్‌కు సిఫారసు చేయాలన్నారు. అనంతరం సుమోటు కింద కుల ధృవీకరణ పత్రాలు మంజూరు కు జాబితాలను సంబంధిత గ్రామ సచివాలయంలో ప్రచురిస్తారన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి తమ లాగిన్‌లో ఉన్న జాబితాలోని ప్రతి వ్యక్తి వివరాలను సేకరించాలన్నారు. ఈప్రక్రియను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలని తహసిల్దార్ ఆదేశించారు. కావున జాబితాలో ఉన్న ప్రతి ఒక్కరూ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి విచారణకు వచ్చిన సమయంలో సంబంధిత పత్రాలను , వివరాలను అందజేసి త్వరితగతిన కుల ధృవీకరణ పత్రాలను పొందాలని ఆయన కోరారు. అల్లంపాడు సచివాలయంలో 292 దరఖాస్తులు, భీమవరం 427, బ్రాహ్మణపల్లి 208, బూదవాడ 362, చిలకపాడు 450, చినమాచనూరు 568, చుంచులూరు 167, డిసిపల్లి 471, ఇర్లపాడు 463, కంపసముద్రం 413, మర్రిపాడు 404, నందవరం 260, పిఎన్‌పల్లి 517, పల్లవోలు 311, పొంగూరు 499, రామానాయుడుపల్లి 420, సింగనపల్లి 340 మొత్తం 6572 దరఖాస్తులు ఉన్నాయని తహసిల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు.

## నేటినుంచి బోగోలు 144 ఎల్ సి గేట్ మూత

**బిట్రగుంట ఆగస్టు 18 ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బోగోలు ఎల్ సి గేట్ 144 ను అత్యవసర పనుల దృష్ట్యా తాత్కాలికంగా ఈ నెల 19 వ తేది నుండి 24 వ తేది వరకు (ఆరు రోజులు ) మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కావున తూర్పు, పడమర గ్రామాలవారు రవాణా సదుపాయాలు ప్రత్యామ్నాయం గా చూసుకోవాలని, 143 కుమ్మరిగేటు నుండి, శ్రీవెంకటేశ్వరపాలెం 146 ఎల్ సి గేటునుండి చిన్న వాహనాలు అనుమతింపబడతాయని వారు ఉత్తరువులో పేర్కొన్నారుకావున ఈ మార్పును వాహనదారులు, ప్రజలు గమనించి రైల్వే శాఖకు సహకరించాలని కోరారు.

## ఆది పరమేశ్వరులకు పూజలు



**విడవలూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** మండల కేంద్రం యలగాలమ్మ గుంట,అన్నారెడ్డిపాలెం పరిధిలో వెలసియున్న శ్రీ శాంభవి సహిత స్వభూలి ఒగేశ్వరస్వామి సోమవారం సందర్భంగా విశేష పూజ నిర్వహి ంచారు. స్వామివారికి ఉదయం తైలాభిషేకం, పాలాభిషేకం, కుంకుమా ర్చన, విశేష పూలఅలంకరణ అలంకరించడంతో స్వామివారు భక్తులకు ఆదిపరమేశ్వర రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తిలకించిపోయారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరి ంచారు. భజన భక్త మండల వారిచే భక్తి గీతాలు ఆలపించారు. మధ్యా హ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు.

## మంతెన సత్యనారాయణ పదోన్నతి పై హర్షం వ్యక్తం చేసిన బీద



**నెల్లూరు,ఆగస్టు18,ప్రభాతవార్త-వైద్యం:** సీఎం కార్యక్రమాల సమన్వయకర్త గా మంతెన సత్య నారాయణ రాజు కు సహాయమంత్రి హోదా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శాసనమండలి సభ్యులు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. వారిపై ప్రభుత్వం ఉంచిన బాధ్యతలకు పరిపూర్ణత చేకూర్చి, అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షి ంచారు.

## కలవళ్ల సచివాలయంపై కలెక్టర్‌కి పిర్యాదు



**వలేటివారిపాలెం ఆగస్టు 18, ప్రభాతవార్త :** మండలంలోని కలవళ్ల గ్రామ సచివాలయంను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం సాయంకాలం ఆకస్మిక తనిఖీచేశారు.హాజరుపట్టీని మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.ఈ సమయంలో 10 మంది సిబ్బందికిగానూ కేవలం ఒకే ఒక్క వ్యక్తి విధుల్లో ఉండడాన్ని ఆయన ఆక్షేపిం చారు. మిగిలిన సిబ్బంది పనితీరును ఆరాతీశారు.ముందుసు అనుమతి లేకుండా విధులకు గైరుహాజరుకావడాన్ని ఆక్షేపిం చారు.విధి నిర్వహణలో సమయపాలన పాటించని సిబ్బందిపై తీవ్ర పరిణా మాలుంటాయని హెచ్చరించారు.అనధికారికంగా గైరు హాజరుపై పోన్‌లో ఎంపీడీవోని సంప్రదిం చారు.సిబ్బంది పనితీరు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ఉందని అభిప్రాయపడ్డారు.దీంతో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి పోన్‌లో పిర్యాదు చేశారు.ప్రజలకు అందుబాటులో లేకుండా సమయపాలన పాటించని సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## నిరంతర యజ్ఞంలా కందుకూరు పట్టణ అభివృద్ధి



**కందుకూరు,ఆగస్టు 18, ప్రభాతవార్త:** పట్టణ అభివృద్ధి నిరంతర యజ్ఞంలా సాగుతుందని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు జంక్షన్ వరకు రోడ్ల వెడల్పు, డివైడర్ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయనీ అంబేద్కర్ విగ్రహం నుంచి వాసవి నగర్ వరకు డబుల్ రోడ్డు, డివైడర్ నిర్మాణం, సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం మూడు రోజుల్లో భూమి పూజ చేయబోతున్నామన్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన సైడ్ కాలువల స్థానంలో కాంక్రీట్ కాలవలు నిర్మించేందుకు 2 కోట్ల రూపాయల నుడా నిధులు మంజూరైనట్లు తెలిపారు.పట్టణ అభివృద్ధి పక్క ప్రణాళిక ద్వారా ముందుకు వెళుతూ, నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నామని. ప్రజలు మా మీద పెట్టుకున్న ఆశలన్నీ నెరవేర్చటానికి కృషి చేస్తున్నామన్నారు. కందుకూరు పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తయారు చేయడమే నా లక్ష్యం అని పునరుద్ఘాటించారు. ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కందుకూరు వచ్చినప్పుడు, 50 కోట్లు కందుకూరు పట్టణ అభివృద్ధికి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 7 కోట్ల రూపాయలు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. మరో 5 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ఆ నిధులు కూడా త్వరలో మంజూరు కాబోతున్నాయి. గెలిచిన తొలి ఏడాదిలోనే సుమారు 10 కోట్ల రూపాయలపైగా అభివృద్ధి పనులు చేశామంటే, అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 500 మంది లబ్ధిదారులకు ఉదారంగా నిధులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి సంవత్సరంలోనే ఇంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేయడం ఒక రికార్డు. తాజాగా 86 మంది లబ్ధిదారులకు 85.5 లక్షలు మంజూరు చేయటం జరిగిందనీ వివరించారు.అదేవిధంగా కందుకూరు పట్టణంలో ఇళ్ల మధ్య ఉన్న డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నారనీ. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దాదాపు లక్ష టన్నుల చెత్త ఇక్కడ పేరుకుపోయి ఉంది. ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు ఆ చెత్తను రీసైక్లింగ్ చేసే ప్రక్రియను మొదలుపెట్టాం. నాలుగు నెలల లోపే ఇక్కడ చెత్తనంతా రీసైక్లింగ్ చేసి, డంపింగ్ యార్డ్ స్థలాన్ని అందంగా మారుస్తాం. పట్టణ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు బుసారెడ్డి కృష్ణారెడ్డి, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు..

## కావలి కేంద్రంగా జిల్లాని ఏర్పాటు చేయాలి...

**కావలి,కందుకూరు, ఉదయగిరి, కోవూరు, పాత అల్లూరు నియోజకవర్గాలతో కావలి కేంద్రంగా జిల్లాను చేయాలని కోరుతూ**



**కావలి,ఆగస్ట్ 18, ప్రభాత వార్త:** సోమవారం ఆర్ డి ఓ సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది అనంతరం మాట్లాడారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశలోనే 24వ జిల్లాగా చేయాలనే ప్రజల ఆకాంక్ష ఉద్యమ నేపథ్యంగా కూడా ఉన్నది. కావలి ప్రాంతం ఒక జిల్లాగా ఏర్పడటానికి కావాల్సిన అన్ని రకాల అనుకూలతలు చాలా ఉన్నాయి. కనుక తమరిని పరిశీలించమని కోరుతున్నాం. రాష్ట్రంలోనే కావలి ప్రాంతానికి సుదీర్ఘమైన తీరప్రాంతం ఉంది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి ఏయిర్పోర్ట్, జాతీయ రహదారి, రైల్వే మార్గం, వస్త్ర రంగంలో మినీ ముంబైగా పేరు ఉంది. కావలి నుండి కడప ముంబై జాతీయ రహదారి వంటి అనుకూలతలు ఇప్పటికే ఉన్నాయి. కావలి ప్రాంతం ఎప్పటినుండో విద్యా హబ్ గా ఉంది. ఆక్వా రంగానికి మంచి ఆదరణ ఉంది. గండిపాలెం, రాళ్ళపాడు, మరియు సోమశిల కుడి, ఎడమ, తూర్పు, ఉత్తర కాలువలు కావలి వ్యవసాయ రంగాన్ని డెల్టా గా మార్చుతున్నాయి. జీఎస్టి, సేల్స్ టాక్స్ వసూలుకు పెన్న ఇవతల ఒక డివిజన్ గా ఇప్పటికే ఉంది. పరిపాలనా పరంగా ఇప్పటికే కావలి, కందుకూరు లకు సబ్ కలెక్టర్ హెదా కూడా ఉంది. రెండు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. పెన్నాకు ఇవతల ఉన్న కావలి పెద్ద మున్సిపాల్టిగా ఉంది. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్మారక కేంద్రం కావలి ప్రక్కనే జువ్వలదిన్నెలో ఉంది. ఇవన్నీ కూడా కావలి జిల్లాగా ఏర్పడటానికి కావాల్సిన అనుకూలతలు సమకూరి ఉన్నాయి. పెన్నాకు దక్షిణంగా నెల్లూరుకి ఉత్తరంగా కావలి జిల్లాగా ఏర్పడితే గుంటూరు విజయవాడలాగా అభివృద్ధి చెందటానికి మంచి అవకాశం ఉంది. ఇప్పటికే పోర్టు ఆధారిత పరిశ్రమలు ఇండోసోల్, బిపిసిఎల్కంపెనీలు వచ్చేసాయి. భవిష్యత్లో ఇంకా అనేక పరిశ్రమలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి అభివృద్ధి కావటానికి మార్గం ఉంది. ఎప్పటినుండో కావలి న్యాయవాదులు జిల్లా కోర్టు కోసం డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఒంగోలుకు నెల్లూరుకు కావలి సమాన దూరం ఉండటం వలన భవిష్యత్లో జంట నగరాలుగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది. కావలిని జిల్లాగా చేస్తే మరో నాలుగు మున్సిపాల్టీలు ఏర్పడటానికి అవకాశాలు ఉన్నాయి. ఉదయగిరి ప్రాంతంలో విశాలమైన ప్రభుత్వ భూములు ఉన్నా ఉదయగిరి కోటను పాలనా కేంద్రంగా చేసుకున్న శ్రీకృష్ణ దేవరాయుల చరిత్ర ఉంది. ఆధ్యాత్మికంగా . మినీ తిరుమలగా పేరున్న కొండబిట్రగుంట, జొన్నవాడ, వెంగమాంబ దేవాలయాలు ఉన్నాయి. అంతేకాకుం ఎంతోమంది ప్రముఖులు, ఎం.పి.లు కావలి ప్రాంతం నుండి ఉన్నారు. భారత ఉపరాష్ట్రపతి గా ఉన్న శ్రీవెంకయ్యనాయుడు ఈ ప్రాంతం వారే. కనుక కావలి, కందుకూరు, ఉదయగిరి, కోవూరు, పాత అల్లూరు నియోజక వర్గాలతో కావలి కేంద్రంగా జిల్లాను చేయాలని కోరుతున్నాము. కావలి కేంద్రంగా జిల్లాను చేయడానికి కావల్సిన అనుకూలతలు ఉన్నాయి. జిల్లాగా ఏర్పడితే మరింత కావలి ప్రాంతం అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంది. ముందు తరాలవారికి మంచి భవిష్యత్ అందించటానికి కావలి జిల్లాగా ఏర్పడటం ఒక అవసరం. తమరు పరిశీలించి ప్రజల న్యాయమైన ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియచేయాలని కోరుతున్నాము. కావలి జిల్లా సాధన సమితి సభ్యులు పులి చక్రపాణి, పులి రజని, కరవది భాస్కర్, అమంచి సుబ్బు, అక్కిలగుంట రమేష్

## చిన్న పవని పిఎసిఎస్ అధ్యక్షునిగా ముళ్ళపాటి లక్ష్మి నరసింహం



**లింగసముద్రం,ఆగస్టు 18, ప్రభాతవార్త:** చిన పవని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి ఎస్) చైర్మన్ ముల్లపాటి లక్ష్మీనరసింహం , సభ్యులుగా రావెళ్ల మాలకొండయ్య, కనపర్తి మాలకొండయ్యలు నియమితులయ్యారు. సోమ వారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు మేలు చేయడంతో పాటు పి ఎస్ సి ఎస్ లను అభివృద్ధి పథంలో నడిపించాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో రాళ్లపాడు ఆయకట్టు చైర్మన్ ఏలూరు వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మోతుకూరి పర్వతాలు, మేదరమిట్లపాలెం సర్పంచ్ కూరపాటి మాధవి, పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, బుచ్చయ్య చౌదరి, మాధవరపు బ్రహ్మయ్య, కంకణాల సుబ్బులు నాయుడు, గొర్రెపాటి శీను మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యా వాలంటీర్ నియామకానికి సహకరించిన దాత



**ఉదయగిరి, ఆగష్టు 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పుల్లాయపల్లి ప్రాథమికోనత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు 8 వ తరగతికి గాను ఇద్దరే ఉపాధ్యాయులు ఉండడంతో బోధనా కష్టతరంగా మారింది. ఉపాధ్యాయుల కొరత విషయాన్ని ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి గ్రామస్తుల దృష్టికి తీసుకువెళ్లగా పాలకొండ వెంకటేష్ అనే పూర్వ విద్యార్థి స్పందించి విద్యా వాలంటీర్‌ను నియమించారు. విద్యా వాలంటీర్ వేతనానికి అయ్యే ఖర్చు తాను పూర్తిగా భరిస్తానని హామీ ఇచ్చారు. బీఎస్సీ బీఈడీ పూర్తి చేసిన ప్రియాంక అనే విద్యా వాలంటీర్‌ను నియమించారు. సుమారు రూ.60వేలు అయ్యే జీతం ఖర్చును కీ.శే పాలకొండ శ్రీనివాసులురెడ్డి పేరు మీద వారి తమ్ముడు పాలకొండ వెంకటేష్ చెల్లిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రశాంత్ కుమార్, స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు రత్నం, పాఠశాల చైర్మన్ దేవ కుమారి, పూర్వ విద్యార్థులు జయసింహ శ్రీనాథ్, ప్రసాద్, శ్రీకాంత్, రాజా ప్రతాప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా 108 కలశాలతో మహోత్సవం




**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** కోవూరు పట్టణంలోని లక్ష్మీనగర్‌లో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రావణమాస దశమి సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల అప్పలాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, చక్కెర, తేనెతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. ఈ ప్రాంగణమంతా గోవిందనామ స్మరణలతో మార్మోగింది. ఈ సందర్భంగా భక్తుల సహకారంతో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ముందుకు సాగాలి





**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఒక నిర్ణీత లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ నాగ ప్రసాద్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల పట్ల, కుటుంబ విలువల పట్ల అచంచల గౌరవాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన తర్వాతనే జీవితంలో స్థిరపడాలని సూచించారు. కావలి విశ్వోదయ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షులు వి. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని ఆత్మాభిమానాన్ని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే మరింత అద్భుత విజయాలను సాధించవచ్చన్నారు. ఈ దిశగా ప్రతి విద్యార్థి ముందుకు సాగాలన్నారు. కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇంజనీరింగ్ చదివే తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. 75 శాతం హాజరు కలిగిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం రీయంబర్స్‌మెంట్ లభిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ కళాశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల అనేక విజయాలను సొంతం చేసుకుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ హెడ్ క్యాటరింగ్ డాట్ కమ్ పి. సుజిత్‌రెడ్డి పలు విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గత సంవత్సరం టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి పి. శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వై. విజయశంకర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రవణ్‌కుమార్ రెడ్డి, అడ్మిషన్ డీన్ డాక్టర్ టీఎన్‌వీఎల్ఎన్ కుమార్, డాక్టర్ పీఎం కిషోర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

## పాఠశాల మనది అనే భావన ప్రతి విద్యార్థిలో ఉండాలి



**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** ఈ పాఠశాల మనది అనే భావన ప్రతి విద్యార్థిలో కలిగిన నాడే ఆ పాఠశాల అన్ని రంగాల్లో దూసుకుపోతుందని ప్రధానోపా ధ్యాయిని సోఫియా కిరణ్మయి అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ఆధ్వర్యంలో పాఠశాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. పాఠశాల పరిసరాలను విద్యార్థులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా తమవంతుగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తమ పుట్టిన రోజు నాడు జ్ఞాపకంగా పాఠశాలలో ఒక మొక్కను నాటి ఆ మొక్కకు తమ పేరు పెట్టుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా మరింత అవగాహన అవసరమన్నారు. ఈ కార్యమంలో ఫిజికల్ డైరెక్టర్లు పి. సులోచన, స్వాతి, ఉపాధ్యాయులు గీతామాధురి, తదితరులు ఉన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణం




**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** కోవూరులోని లక్ష్మీనగర్‌లో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాస దశమి పర్వదినం సందర్భంగా సోమవారం స్వామివారి కళ్యాణం కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు చక్రవర్తుల అప్పలాచార్యుల స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా రుత్వికులు స్వామివారి కళ్యాణ విశిష్టతను భక్తులు వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కళ్యాణ కార్యక్రమానికి ఉభయకర్తలుగా నెల్లూరు ధనుంజయ రెడ్డి, రాజ్యలక్ష్మి, తోటిరెడ్డి బ్రహ్మారెడ్డి, లక్ష్మి, నూకల గణేష్ రాజా, హిమబిందు దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా కళ్యాణ కార్యక్రమం అనంతరం మాడవీధుల్లో పల్లకి సేవ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా సింగంశెట్టి రమేష్, లక్ష్మీరాజ్యం, ఎస్. వెంకటేశ్వర్లు నాయక్, నానికీబాయి, వెంకటేశ్వరరాజు, వనజాక్షి దంపతులు వ్యవహరించారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యుద్దీపాలంకరణకు ఉభకకర్తలుగా వైస్ ఎంపీపీ శివుని నరసింప ులురెడ్డి-రమాదేవి దంపతులు వ్యవహరించారు.

## విచారణ జరిపి చట్టపరంగా చర్యలు



**నెల్లూరు క్రైం, ఆగస్టు 18, ప్రభాతవార్త:** స్థానిక దర్గామిట్టలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఖిప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి. కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 78 ఫిర్యాదులు అందాయి. పొదలకూరు పరిధికి చెందినటువంటి ఇద్దరు దంపతులు బీటెక్ పూర్తి చేసినట్లు, లింక్డ్ ఇన్ ద్వారా మాధురి, వెంకటరమణ, చేతన్ అనే వ్యక్తులు పరిచయమై బెంగళూరులో సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.3.40 లక్షలు నగదు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారని అదే విధంగా నెల్లూరు రూరల్ పరిధికి వ్యక్తిని, హైదరాబాద్‌కు చెందిన సుదర్శన్ అనే వ్యక్తి క్రిప్టో ట్రేడింగ్ పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ. 8 లక్షలు ఇన్వెస్ట్ చేయించి, 6 నెలల నుండి ఎటువంటి ప్రాఫిట్ ఇవ్వకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా, ఫోన్లో రెస్పాండ్ కాకుండా ఆర్థికంగా నష్టం పరిచి, ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు. కావలి పరిధికి చెందినటువంటి వృద్ధురాలిని తన కుమారులు ఇంటి నుండి తరిమి వేశారని రాత్రిపూట బస్టాండ్లో పడుకుంటున్నట్లు తినడానికి తిండి కూడా లేదని, కొడుకు కోడలు పట్టించుకోవడంలేదని విచారించి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా సంతపేట పరిధికి చెందిన వృద్ధుని తన మీద ఉన్న ఆస్తి మొత్తం రాయించుకొని తన చిన్న కుమారుడు ఇంటి నుండి గెంటివేశాడని కొట్టి వేధిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ డిఎస్పి సింధుప్రియ, వేదాయపాలెం సిఐ శ్రీనివాసరావు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేణుగోపాల్ స్వామి దేవస్థానంలో ముమ్మరంగా ప్రారంభించిన అభివృద్ధి పనులు

– కృష్ణాపట్నం టిడిపి సీనియర్ నాయకులు రాగాల శివకృష్ణ



**ముత్తుకూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** కృష్ణాపట్నం రుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణంలోని ఖాళీ ప్రదేశంలో కళ్యాణ మండపం, వేదపండితులకు గృహ నిర్మాణం, చుట్టూ ప్రహరి గోడ నిర్మాణం, వేద పాఠశాలకు స్థలం వంటి పలు విషయాలపై ఆలయ చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, ఆలయ గుమస్తా వినోద్ దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీనియర్ టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో, ఆయన సహకారంతో ఆలయం చుట్టు పక్కల పరిశుభ్రం, ఆలయం లోపల మట్టి లెవలింగ్ పనులను చేపట్టామని తెలిపారు. ఆయన సహకారంతోనే ఆలయ అభివృద్ధికి కావాల్సిన పనులను చేపడుతామని తెలిపారు. త్వరితిగతిన ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసి సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఆయన వెంకట మల్లికార్జున్, పురిణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరెట్ వద్ద ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని "బహుజన్ సమాజ్ వారి పార్టీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నివాహించారు. అన్నంతరం సోమవారం తిక్కన్న ప్రాంగాణంలో నిర్వహించే ప్రజా పరిష్కర వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహెన్ కుమారి మాయావతి తారి ఆదేశాల మేరకు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర శాఖ ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర కుల జన గణన చేసి సీల జనాభా ఎంత ఉన్నదో అంత శాతం స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో, నామినేటెడ్ పదవుల్లో, విద్యాఆద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు వారి అభివృద్ధి, సంక్షేమం కొరకు జనాభా దామాషా ప్రకారం ధులు ఖర్చు చేయాలని, అలాగే కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణనలో కులగనన చేయాలని వంతరం అనేక విధాలుగా పోరాటాలు చేసి డిమాండ్ చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికలు జాతీయ గణనకు ముందే జరిగే అవకాశం ఉందని. ప్రకటించిన బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన్ మాజ్ పార్టీ డిమాండ్ చేశారు.

## భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చేవూరు.వినయ్ నారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు దరకు వరిదాన్యాన్ని రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రము ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మరో వారం పది రోజుల్లో వరికోతలు ప్రారంభం కానున్నాయనీ, ఇంత వరకు క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కాకపోవడం, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఒకపక్క రైస్ మిల్లర్లు నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలలో పుట్టి ధాన్యాన్ని కేవలం 15,000 రూపాయల అతి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నడడంతో జిల్లాలోని రైతులు అయోమయంలో ఉన్నారనీ, నారువేతలు పూర్తయిన నెల రోజుల లోపు పూర్తి చేయాల్సిన క్రాప్ నమోదు ఒక పక్క వరికోతలు కోస్తున్నా, ఇంతవరకు పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడి ఉందనీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, గిన్నీ బ్యాగ్స్ అందుబాటులో లేకపోవడం, మిల్లర్లు నిర్ణయించిన అతి తక్కువ ధరకే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకొని తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడి ఉంది. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు విస్తారంగా పడుతున్నందున రైతులు తమ ధాన్యాన్ని ఆర పోసుకునేందుకు కల్లాలు లేక, టార్పాల్ పట్టలు లేక, ఒకవేళ రోడ్డు ప్రక్కన, పొలాలలో ఆరబోసుకున్న ధాన్యం వర్షం వచ్చి తడిస్తే పూర్తిగా ధాన్యం చెడిపోయే అవకాశం ఉన్నందున ప్రభుత్వం నిర్ణయించిన 17శాతం తేమశాతాన్ని గతంలో తమరు సూచించిన క్వింటాకు 1 కేజీ ఎక్కువ దామాషా ప్రాతిపదికన రైతుల నుండి ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్లు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకొని, ఇప్పటికే నష్టాల ఊబిలో ఉన్న కౌలు రైతులు, రైతులను కాపాడాలని త్వరితగతిన్క్రాప్ నమోదు పూర్తి చేయించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించి ప్రభుత్వం మద్దతు ధరకు తగ్గకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే విధముగా చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చేవూరు. వినయ్ నారాయణ, కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కల్కి.హరిసర్వోత్తమ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హర్షవర్ధన్, కిసాన్ మోర్చా రాష్ట్ర డ్రియినేజీ సెల్ కో కన్వీనర్ చల్లా హనుమారెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పార్లపల్లి.వెంకట మహేష్ నాయుడు కుంచాల శివ, బొర్రు అంకయ్య, యల్లాల శివప్రసాద్ రెడ్డి, పోలిశెట్టి సుబ్బారావు రైతులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి సన్నిధిలో మొదటి వార్షికోత్సవం





**సంగం ఆగష్టు 18 ప్రభాతవార్త :** సంగం మండలం దువ్వూరు గ్రామంలో వైభవంగా ఆంజనేయస్వామి మొదటి వార్షికోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అంజనీ వైద్యశాల వారు డాక్టర్ ఎం.శ్రీహరిబాబు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి భక్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

## అంగరంగ వైభవంగా పొలంపాడు శ్రీపోలేరమ్మ తిరుణాళ్లు



**కలిగిరి, ఆగష్టు18, ప్రభాతవార్త;** కలిగిరి మండలం పోలంపాడులో వెలసిన పోలంపాడు శ్రీపోలేరమ్మ తల్లి తిరుణాళ్లు అంగరంగ వైశవంగాజరుగుతున్నాయి. కొండా 9గ్రామాలసమక్షంలో జరిగే ఈవేడుకల 5రోజులపాటు కన్నుల పండుగలా బక్తులు నిర్వహించను న్నారు. 5రోజులపాటు జరిగే ఈతిరుణాళ్లగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తిరుణాల్లను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తు న్నారు.ఈ క్రమంలో శ్రీపోలేరమ్మ తల్లి ని రోజూ ఒక గ్రామంలో గ్రాముత్సోహం నిర్వహిస్తారు. చివరి రోజైన గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజులు, అమ్మవారి దర్శన బాగ్యం కల్పిస్తారు. అనంతరం సాంసృతిక కార్యక్రమాలు , బళ్లతిరుగుట, బండలాగుడు పందాలు నిర్వహిస్తారు. 5రోజులపాటు జరిగే ఈ వేడుకలును చూసేందుకు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

## సేంద్రియ ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం



**రాపూరు, ఆగష్టు18ప్రభాతవార్త :** సేంద్రియ ఉత్పత్తులు ఆహార పదర్థాలుగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని రాపూరు తహశిల్దార్ లక్ష్మీనరసింహం తెలిపారు. సోమవారం రాపూరు మండల కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులైన కూరగాయాల అమ్మకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కార్యలయానికి వచ్చిన అర్జీదారులు పలువురు సేంద్రియ కూరగాయలు కోనుగోలు చేశారు. ప్రతి సోమవారం మండల కార్యలయం ఆవరణలో ఏర్పాటు చేస్తున్న సేంద్రియ కూరగాయలును కోనుగోలు చేసేందుకు పలువురు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో యంపీడీఓ మారెళ్ళ భవాని, పలువరు నాయకులు, ప్రజలు వున్నారు.

## 19 నుండి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**బిట్రగుంట ఆగస్టు 18 ప్రభాతవార్త:** బోగోలు మండలం లో 8 సచివాలయాల పరిధిలో ఈనెల 19 నుండి ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.19 జెపిగూడూరు, 20న నాగులవరం, 21న తాళ్లూరు, 22న బిట్రగుంట, 23న అల్లిమడుగు, 28న బోగోలు, 29న జువ్వలదిన్నె, 30న సిఆర్ పాలెం లో నిర్వహించడం జరుగుతుంది అన్నారు.కావున సచివాలయం పరిధిలోని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, అన్ని శాఖాల అసిస్టెంట్లు ఈ విషయం పైన విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు.

## కొండ బిట్రగుంటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బృందం పర్యటన



**బిట్రగుంట ఆగస్టు 18 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కోనేరు పునరుద్ధరణ పనులను పున ః ప్రారంభించేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బృందం సోమవారం పర్యటించింది .ఇటీవల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయన సతీమణి కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంత రెడ్డిలు కావలి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు రెండు కోట్ల 10 లక్షల రూపాయలతో అసంపూర్తిగా ఉన్న కోనేటి నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు ముందుకు వచ్చి శంకుస్థాపన చేయడం తెలిసిందే. అయితే ఈ పనులు ఏ విధంగా పూర్తి చేయాలి? దానికోసం ప్రణాళికలు తయారు చేసేందుకు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బృందం ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి,విశ్రాంత ఇంజనీరు గోపికృష్ణులతో కలిసి కోనేరు నిర్మాణప్రాంతాన్ని పరిశీలించారు. వారి వద్ద నుంచి పూర్తి సమాచారం తీసుకొని ఒక అవగాహనకు వచ్చి త్వరలో ఈ పనులు ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపధిక పైన పూర్తి చేస్తామని వారు ప్రకటించారు.దీంతో ఎట్టకేలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు కోనేటి అసంపూర్తి నిర్మాణానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కోరిక మేరకు విరాళం ప్రకటించి ముందుకు రావడంతో ఈ పనులు బ్రహ్మోత్సవాలు లోపల పూర్తి కావచ్చని భావిస్తున్నారు.

## రైలు లో నుంచి జారిపడి వ్యక్తి మృతి



**బిట్రగుంట ఆగస్టు 18 ప్రభాతవార్త:** కావలి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తలమంచి రైల్వే స్టేషన్ యార్డు నందు దిగువలేనులో గుర్తు తెలియని మగ మనిషి వయస్సు రైలు లోనుండి జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 30 35 కలిగి ఉండి, గుర్తు తెలియని రైలు బండి వచ్చు సమయంలో రైల్వే ట్రాక్ దాటుచుండగా లేదా రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపట్టవలన కలిగిన గాయముల వలన మరణించి ఉండవచ్చు భావిస్తున్నామన్నారు. మృతుడు గ్రీను బ్రౌన్ రంగు గల ఆఫ్ హ్యాండ్ టీ షర్టు.,బ్రౌన్ రంగు లోయర్ ఫ్యాంటు. మృతుని ఎత్తు 5'6, ఎరుపు రంగు, మృతదేహం ఉన్నాడని అన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కేసును కావలి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

## రైలు లో నుంచి జారిపడి ఉద్యోగి మృతి

**బిట్రగుంట ఆగస్టు 18 ప్రభాతవార్త :** కావలి రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తలమంచి కొడవలూరు రైల్వే స్టేషన్ మధ్య కే.ఏం నెం 188/9 7 పోస్టుల మధ్య ఎగువ లైనులో సోమవారం నక్క రాంకుమార్, ఏంపిహెచ్ ఏ ,కోవూరు పల్లి, పి హెచ్ సి,ఆర్/ఓ , నియర్ కొత్తపట్నం బస్టాండ్ ,ఒంగోలు . అనువారు గుర్తు తెలియని రైలు బండి లో ఒంగోలు నుండి డ్యూటీ కని బయలుదేరి సద రైలు బండిలో ప్రయాణిస్తూ, ప్రమాదవ శాత్తు పై కిలోమీటర్ల వద్ద జారిపడి మరణించారని రైల్వే పోలీస్ లు తెలిపారు సమాచారం ను బంధువులకు తెలియపరిచి.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజా వేదికలో పలు సమస్యలపై అర్జీలు తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** సోమవారం జరిగిన ప్రజా వేదిక పరిష్కార కార్యక్రమంలో మండల ప్రజలు తహసిల్దార్ కార్యాలయంకు చేరుకుని వారి సమస్యలను తెలుపుకున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ వచ్చిన అర్జీలు పొలానికి సంబంధించి వన్ బి, అడంగల్, మరికొందరు ఇతర సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగింది. వీటన్నిటిని పరిశీలన చేసి పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. గ్రామ వీఆర్వోలు గ్రామ రైతు సమస్యలను తెలుసుకోవాలి, శిస్తు వసూలు కూడా వేగవంతంగా వసూలు చేయాలన్నారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సారంగపాణి, ఆర్ ఐ, సర్ మండల సర్వేయర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## సంగం హైస్కూల్ విద్యార్దులకు యువ అన్‌స్టాపుబుల్ స్కాలర్ షిప్




**సంగం ఆగష్టు 18 ప్రభాతవార్త :** 2024 -25 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి పూర్తి చేసిన నలుగురు విద్యార్దులు యువ అన్‌స్టా పుబుల్ స్కాలర్ షిప్ స్కాలర్ షిప్‌కి ఎంపికయ్యారు. ఈ స్కాలర్ షిప్ బక్కొక్కరికి 2 లక్షల రూపాలు విలువైనది.ఈ సందర్భంగా పాఠశా లలో జరిగిన కార్యక్రమంలో కె. జ్యోతివల్లికు,కె.రామ్‌సాయి, జి.రుషిత, పి హర్షిణిలకు సాల్కర్‌షిప్ లెటర్‌ను ప్రదానోపాధ్యాయులు పి .బుజ్జయ్య విద్యార్దులకు అందించారు. ఈకార్యక్రమంలో విద్యార్దులు తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కుళ్లిపోయిన మృతదేహం గుర్తింపు

**కావలి,ఆగస్ట్ 18, ప్రభాతవార్త:** ఎటువంటి ఆనవాళ్లు లేకుండా కుళ్ళిపోయిన మృతహదేహాన్ని సిరిపురం గ్రామంలోని జామాయిల్ తోటలో సోమవారం రైతులు గుర్తించడం జరిగింది కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామ సమీపంలోని జామాయిల్ తోటలో కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఎటువంటి ఆనవాళ్లు లేకుండా ఉన్న మృతదేహాన్ని రైతులు గుర్తించి గ్రామ వీఆర్ఏ కి సమాచారం తెలపడం జరిగిందని తెలియజేశారు ఆయన వెంటనే కావలి రూరల్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించడం జరిగిందన్నారు కావలి రూరల్ ఎస్సైలు బాజీ బాబు ,తిరుమల రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించడం జరిగిందన్నారు మృతదేహానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు దొరకలేదు అన్నారు సుమారు 50 నుండి 55 సంవత్సరంల మధ్య లో వయసు ఉండవచ్చునని తెలియజేశారు దాదాపు చనిపోయి 10 రోజులు నుండి 15 రోజులు వరకు ఉండొచ్చుననీ తెలియజేశారు కావలి రూరల్ ఎస్సై బాజీ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## కండలేరులో 28.59 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు),ఆగష్టు18ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయం నాటికి జళాశయంలో 28.59 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జళాశయంలోకి 7160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1835 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 30 క్యూసెక్కులు, లోలెవల్ లిప్టింగ్‌కి 100 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1985 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కావలి ఎమ్మెల్యే



**దగదర్తి, ఆగష్టు18, ప్రభాతవార్త :** దగదర్తి మండలం బోడగుడిపాడు గ్రామానికి చెందిన బత్తల హజరత్తయ్య లోక సుందరమ్మ దంపతుల కుమారుడు అభినాష్ యాదవ్ అభిష్న వివాహం ఆదివారం రాత్రి జరిగింది. ఈ వివాహ కార్యక్రమంలో పాల్గొన్న లేకపోయినా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వ దించి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రజల కోసం పోరాడిన కేసుల్లో బీజేపీ నాయకులకు కోర్టులలో వాయిదాల పర్వం



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 18, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా జరిగిన అనేక పోరాట నేపథ్యంలో వారిపై వివిధ కేసులు నమోద య్యాయి. ఈ కేసుల వాయిదాల పర్వంలో బీజేపీ నేతలంతా తలమునకలై తమ విలువైన సమయాన్ని వెచ్చించి వాయిదాల నేపథ్యంలో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. సోమవారం నగరంలోని ఒ కోర్టులో బీజేపీ సీనియర్ నేతలంతా ఓ కేసుకు సంబంధించిన వాయిదా కోసం విచ్చేశారు. తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజల సమస్యలే పరమావధిగా పోరాడిన ఈ నేతలంతా ఇలా వాయిదాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ తాము ప్రజల కోసమే పోరాడామని, తమ పార్టీ ఆధ్వర్యంలో తామంతా ఎన్ని కేసులు అయినా భరిస్తామని, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం విషయంలో తాము వెనుకడుగు వేయబోమని పేర్కొన్నారు. ప్రజలే మా శక్తి ప్రజలే మా ప్రాణమని వారి కోసం ఎంత దూరమైనా వెళ్తామని ఎన్ని కేసులు అయినా వెనుకడుగు వేయబోమని వెల్లడించారు. ఈ కేసుల విచారణలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్ కుమార్ యాదవ్, మిడతల రమేష్, కాకు విజయలక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు, ఎరబోలు రాజేష్, ఎన్సీ పెంచలయ్య, కరణం భాస్కర్,అవోక్ నాయుడు, న్యాయవాది రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పముజుల ప్రదీప్ బాధ్యతల స్వీకరణ



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 18, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గుండ్ల పాలెం ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా సౌత్ మోపూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పముజుల ప్రదీప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రామ్మూర్తి నగర్‌లో మిత్రులు సన్నిహితులు టీడీపీ నేతల అభినందనల మధ్య పముజుల ప్రదీప్ చైర్మన్‌గా రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అలాగే సొసైటీ డైరక్టర్లుగా కాకుండా సురేష్‌రెడ్డి, రాపూరు పెంచలయ్య బాధ్యతలు చేపట్టారు. గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ కో- ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి, తుళ్లూరు మల్లిఖార్జున్ దగ్గరుండి నూతన పాలకవర్గ కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు, చైర్మన్ పముజుల ప్రదీప్‌తో పాటు డైరక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుండ్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ పముజుల ప్రదీప్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు చైర్మన్ అవకాశం కల్పించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గుండ్లపాలెం సొసైటీ అభివృద్ధికి తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మీడియా కోఆర్డీనేటర్ జలదంకి సుధాకర్, అన్నం సుధాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఆవరణంలో శరవేగంగా జరుగుతున్న అదనపు భవనం నిర్మాణం

– భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి నారాయణ

– వచ్చే సోమవారం కల్లా భవనాన్ని అందుబాటులో తెస్తామని సీఆర్డీఏ అధికారుల వెల్లడి



**నెల్లూరు, ఆగష్టు 18, ప్రభాతవార్త – వైద్యం :** అమరావతిలోని అసెంబ్లీ ఆవరణంలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. భవన నిర్మాణం మొత్తం 1224 చ.మీటర్ల విస్తీర్ణంలో జీ+1 ఉండే విధంగా చర్యలు చేట్టారు. అందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మీడియా పాయింట్ చేసి డైనింగ్ రూమ్, కిచెన్ ఏర్పాటు చేశారు. అదే విధంగా మొదటి అంతస్తులో 16 ఛాంబర్లు, వెయిటింగ్ హాల్, సర్వర్ రూం ఏర్పాటు చేశారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. వచ్చే సోమవారం నాటికి భవనం అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రికి సీఆర్డీఏ అధికారులు తెలియజేశారు. మంత్రి నారాయణ వెంట అసెంబ్లీ కార్యదర్శి సూర్యదేవర ప్రసన్న కుమార్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## శ్రీజ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్‌గా కోడూరు

– రాజేశ్వరి పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



**తోటపల్లిగూడూరు ,ఆగష్టు 18, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలం వరిగొండ శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్‌గా కోడూరు రాజేశ్వరి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులుగా కర్పూరపు భాస్కర్‌రెడ్డి, జానా జ్యోతి, నెల్లూరు కల్పన, పొందుగల అమృత మద్దినేటి తిరుపాలు, అన్నం శివశంకర్, బూదూరు మురళి, బి.శ్రీనివాస్, ఎస్.పిచ్చమ్మల చేత దేవాదాయ సహాయ కమీషనర్ కే.జనార్ధన్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు ఈవో తాత శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాజేశ్వరి మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో పాలకమండలి తోడ్పాటుతో ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్ సాబ్, కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తోటపల్లిగూడూరు సహకార బ్యాంకు అధ్యక్షులు ఎస్.సురేష్‌రెడ్డి, మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర, కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షులు బాబు నాయుడు, కర్పూరం శ్రీనివాసులురెడ్డి, స్థానిక గ్రామస్తులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని రాజేశ్వరి శ్రీనివాసులరెడ్డి దంపతులను ఆశీర్వదించారు.

## నెల్లూరు జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యపై రాజ్యసభలో మాట్లాడిన బీద మస్తాన్ రావు యాదవ్



**కావలి, 18 ఆగస్టు ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాలలో ఫ్లోరోసిస్ సమస్యపై రాజ్యసభలో శ్రీ బీద మస్తాన్‌రావు యాదవ్ ప్రశ్నను లేవనెత్తారు. ముఖ్యంగా ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లాలోని కందుకూరు, ఉదయగిరి మరియు ఆత్మకూరు నియోజకవర్గాలలో ఫ్లోరోసిస్ వ్యాప్తి అధికంగా ఉండటంతో, బాధిత ప్రజలకు రక్షణ చర్యలు, సురక్షితమైన త్రాగునీరు అందించడం, వైద్య సహాయం మరియు అవగాహన కార్యక్రమాలు చేపట్టే అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని రాజ్యసభలో ప్రశ్నించారు.కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సోమన గారు ఇచ్చిన సమాధానం ఇస్తూ దేశవ్యాప్తంగా ప్రతి గ్రామీణ ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ (జే జే ఏం) అమలు చేస్తోంది.రసాయన కాలుష్యం, ముఖ్యంగా ఫ్లోరైడ్ సమస్య ఉన్న గ్రామాలకు ప్రాధాన్యం ఇచ్చి పైప్‌లైన్ నీటి సరఫరా పథకాలు చేపడుతున్నారు. తాత్కాలిక చర్యగా, ఆర్సెనిక్ మరియు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలో కమ్యూనిటీ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు సూచించారు. యెన్ పి పి సి ఎఫ్ (నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఫ్లూరోసిస్ ) కార్యక్రమం కింద నెల్లూరు సహ ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాలలో ఫ్లోరోసిస్ నివారణకు చర్యలు కొనసాగుతున్నాయి. డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, వైద్య-పారామెడికల్ సిబ్బంది శిక్షణ, బాధితులకు ఆరోగ్య సదుపాయాలు, పునరావాసం, ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రివర్యులు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ బీద మస్తాన్‌రావు యాదవ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత త్రాగునీరు పొందేలా, వైద్య సదుపాయాలు అందేలా చర్యలు మరింత వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఇది అత్యవసరమని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేస్తే ఫ్లోరోసిస్ సమస్యను త్వరగా తగ్గించగలుగుతామని అన్నారు.

## జనవాణికి వచ్చిన ప్రజాసమస్యల పరిష్కరించండి

**- జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కలెక్టర్‌కు వినతి**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభా తవార్త** సోమవారం కలెక్టర్ కార్యాల యలో జరుగుతున్న ప్రజా పరిష్కరా వేదికలో కలెక్టర్ఓ ఆనంద్ తో జనవాణికి వచ్చిన ప్రజాసమస్యల పై జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ చర్చించారు. నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు ఏపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో నెల్లూరు జిల్లా జనసేనపార్టీ కార్యాలయం,గోమతి నగర్ నందు ప్రతి బుధ,శనివారాలు జరుగుతున్న జనవాణిలో వచ్చిన పలు సమస్యల పరిష్కారానికై జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కలెక్టర్ ఓ ఆనంద్ కలిసి పరిష్కార మార్గాలను కోరారు. క్యాన్సర్ బాధితులకు క్యాన్సర్ హాస్పిటల్ ఉచితంగా మందులు పంపిణీ సరఫరా ఆగిపోయింది. దాని పునరుద్ధరణకు మార్గాలను చూడండి అన్నారు. క్యాన్సర్ బాధితులకు క్యాన్సర్ హాస్పిటల్ ఉచితంగా మందులు పంపిణీ సరఫరా ఆగిపోయింది. దాని పున రుద్ధరణకు మార్గాలను చూడండి అన్నారు. ప్రభుత్వ గవర్నమెంటు హాస్పిటల్‌లో ఎమ్మారై లాంటి సేవలు అప్పుడప్పుడు నిలిచిపోయే పరిస్థితి ఉంది ,వైద్య సేవలు పేదలకు నిరంతరం అందుబాటులో ఉండే సాగే చర్యలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, 13 డివిజన్ నాయకుడు పేనేటి శ్రీకాంత్, జనసైనికులు మోనేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## వంగల్లు భీమేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా పగడాల రఘురామయ్య



**సంగం ఆగష్టు 18 ప్రభాతవార్త** సంగం మండలం వంగల్లు భీమేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా పగడాల రఘురామయ్య,7 మంది పాలక మండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఇఒ ప్రసాద్‌రెడ్డి నూతన కమీటి చేత ప్రమాణ స్వీకారంచేయించారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్ పగడాల రఘురామయ్య మాట్లాడుతు తనను చైర్మన్‌గా నియమించిన దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో పలువురు గ్రామస్తులున్నారు.

## పిబిఆర్ విట్స్ లో ఐడియాథాన్ గోడ పత్రిక ఆవిష్కరణ



**కావలి,ఆగస్ట్ 18, ప్రభాత వార్త:** కృత్రిమ మేదస్సు ఉపయోగించి అంతరిక్ష పరిశోధనలో ఏ విధమైన ప్రగతి సాధించవచ్చు అనే అంశం పై విద్యార్థుల సృజనాత్మక ఐడియాలు ప్రదర్శించే అవకాశం ఈ ఐడియాథాన్ ద్వారా కల్పిస్తున్నట్టు కార్యక్రమ నిర్వాహకులు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతరిక్ష పరిశోధనా సంస్థ సీఈఓ డాక్టర్ ఐవి మురళీ కృష్ణ డాక్టర్ యువరాజ్ చిన్నం పాల్గొని ప్రసంగించి విద్యార్థులతో చర్చించ నున్నట్టు విశ్విదయ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్ తెలియజేశారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతున్న ఈ తరుణంలో ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు మరియు దేశానికి ఎంతో అవసరం అని కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతులు నిర్వాహకులను ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించవలసిందిగా కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర కుమార్ రెడ్డి సూచించారు. దేశంలోని వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొని వినూత్న ఆలోచనలను ఆవిష్కరించబోతున్నట్టు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ప్రత్యూష రెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులను అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ లిఖిత్ రెడ్డి ప్రశంసించారు

## బి ఎస్ 5 మెగా లాంచింగ్ ప్రారంభించిన మాలేపాటి



**కావలి,ఆగస్ట్ 18,ప్రభాతవార్త:** మంగళగిరి లోని సివి కన్వెన్షన్ సెంటర్లో జరిగినటువంట మహేంద్ర కన్‌స్ట్రక్షన్ అండ్ ఎక్విప్మెంట్స్ వారి బిఎస్ 5మెగా లాంచింగ్ కార్యక్రమానికి ప్రత్యేక అతిధులుగా సోమవారం హాజరై ప్రారంభోత్సవం గావించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ మాలేపాటి సుబ్బానాయుడు గారు. ఈ సందర్భంగా వీరితోపాటు ఆగ్రోస్ సంస్థ ఇంచార్జ్ జనరల్ మేనేజర్ హెచ్.కూర్మారావు గారు ఉన్నారు

## వైభవంగా ఉమా చంద్ర మౌళీశ్వర స్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట



**కోవూరు , ఆగస్టు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చంద్రమౌళి నగర్ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాస దశమి పర్వదినం సందర్భంగా దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, నవగ్రహ దేవత ప్రతిష్ట, కుంభాభిషేక మ హోత్సవాన్ని అత్యంత వైభవంగా భక్తుల జైజై ధ్వనాల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రాత:కాలమునే స్వామి వారికి ఆలయ అర్చకులు అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ సీహెచ్ లక్ష్మీనారాయణ, గ్రామంలో ఉన్న కమిటీ సభ్యులు , గ్రామస్తుల సహ కారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్ర మంలో కమిటీ సభ్యులు సుధాకర్, వీర రాఘవులు, ఆనందరావు, శ్రీను, నాగరాజు, మణి కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

## సంగం తహసిల్దారుని సన్మానించిన సిబ్బంది



**సంగం ఆగష్టు 18 ప్రభాతవార్త** విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న తహసిల్దారు సోమ్లానాయిక్‌ని తహసిల్దారు కార్యాలయం ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతు అవార్డు తీసుకోవడం అంటే మరింత బాద్యత పెరిగినట్టేనని అన్నారు . ప్రభుత్వ లక్ష్యాలను ప్రతి ఒక్కరు నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో కార్యలయ సిబ్బంది, మండలంలోని విఆర్ఒలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**కొడవలూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం తెల్లవారుజామున జరిగిన ఘటనలు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలు చెన్నై నుండి కావలికి వెళ్లి తిరిగి ప్రయాణంలో తెల్లవారుజామున కొడవలూరు మండలం నాయుడుపాలెం పరిధిలో ఆగి ఉన్న టిప్పర్ను టాటా వ్యాన్ ఢీకొనడంతో మాధవరావు (52) ఎస్.కె హుస్సేన్ (48) చెన్నై మృతి చెందారు. ఈ టాటా వ్యాన్లో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా ముందు వైపు కూర్చున్న ఇద్దరు వ్యక్తులు మాత్రం మృతి, మరి కొంతమందిలో కొందరికి తీవ్ర గాయాలు మిగిలిన వారు క్షేమంగా ఉన్నారని సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతి చెందిన వారిని 108 ద్వారా నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం, గాయపడిన వారిని కూడా తరలించడం జరిగిందని సీఐ సురేంద్రబాబు, ఎస్సై కోటిరెడ్డి కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రోడ్డు ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించండి

## కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆక్రమిస్తూ నిర్మించిన కట్టడాలను అన్ని డివి జన్లలో గుర్తించి, సంబంధిత నోటీసులను జారీ చేసి వాటిని తొలగించాలని కమిషనర్ వై.ఓ నందన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశం చారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ స్థానిక జాఫర్ సాహెబ్ కాల్వకట్ట పరిసం ప్రాంతాలలో సోమవారం పర్య టించారు. పర్యటనలో భాగంగా కాలువ కట్ట ప్రాంతంలో రోడ్లను ఆక్రమిస్తూ ఇరుపక్కల ఉన్న ఆక్రమణలను, వ్యాపారాలను కమిషనర్ గమనించి, సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి వెంటనే ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన రోడ్డు మార్జిన్ ప్రతి ఒక్కరు గుర్తించేలా అన్ని ప్రాంతాలలో మార్కింగ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం మైపాడు రోడ్డు ప్రాంతంలో మున్సిపల్ స్థలాలను కమిషనర్ పరిశీలించారు. సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ బజాం ప్రాజెక్టు నిర్మాణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. అనంతరం స్థానిక ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. సమీప ప్రాంతాలలో ట్రాఫిక్ అంతరాయానికి కారణం అవుతున్న వాహనాలను పార్కింగ్ చేసే విధానంలో ప్రణాళిక పాటించాలని హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. మార్కెట్ పరిసర ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమిస్తూ వ్యాపారాలు చేసేవారిని నియంత్రించేందుకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం రామలింగాపురం ప్రాంతంలో నూతన రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించి నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను నిరంతరం చేపట్టేలా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ రోడ్డు ఆక్రమణలను తొలగించండి

**ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి**



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 18,ప్రభాతవార్త:** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని మద్రాస్ బస్టాండ్ ఎ.సి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ ప్రాంగణం పరిసరాలలో రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తూ, నిరంతరం ట్రాఫిక్ అంతరాయాలకు కారణంగా నిలుస్తున్న రోడ్డు మార్జిన్ దుకాణాలను తొలగించి, తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షించాలని ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 12 వ డివిజన్ ప్రాంతం, పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం ప్రాంతాలలో కార్మికుల మస్టర్ హాజరును డాక్టర్ సోమవారం తనిఖీ చేశారు. డివిజన్ల పరిధిలో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సంబంధిత శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం స్థానిక ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంగణాలను పరిశీలించారు. కూరగాయల మార్కెట్ ఎదురుగా ప్రధాన ట్రంక్ రోడ్డుకు అంతరాయం కల్పిస్తూ దుకాణాలను ఏర్పాటు చేసి ఉన్న రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులను అక్కడి నుంచి తొలగించి, వేరే ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించుకోవాలని డాక్టర్ సూచించారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు విచ్చేసే కూరగాయల మార్కెట్ ప్రాంగణాన్ని నిరంతరం అత్యంత పరిశుభ్రంగా ఉంచి పారిశుధ్య ప్రమాణాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని దుకాణాదారులు, మార్కెట్ అసోసియేషన్ నిర్వాహకులకు డాక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరునగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వభూపాల వాహనంపై వెంకయ్య స్వామి



**వెంకటాచలం,ఆగష్టు 18,ప్రభాత వార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి 43వ ఆరాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామివారికి అభిషేకము, సుప్రభాత సేవ గోపూజ నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించి పూలతో తీర్చిదిద్దారు. మంగళ వాయిద్యాలు మేళ తాళాలు నడుమ స్వామి వారిని అత్యంత వైభవంగా సర్వభూపాల వాహనంపై ఆశీనులు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం ముందు మహిళలు కోలాటాలు నిర్వహించి, ఓం నారాయణ, ఆదినారాయణ అంటూ భక్తులు ముందుకు సాగారు. సర్వభూపాల వాహన సేవకు గొలగమూడి గ్రామస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

**రాత్రి వైభవంగా కల్పవక్ష వాహన సేవ** రాత్రి నిర్వహించనున్న కల్పవృక్ష వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్పవృక్ష వాహన సేవ పై ఆసీనులు చేసి గ్రామంలో విహరించారు. దారి పొడుగునా మహిళలు స్వామి వారికి కర్పూర నీరాజనం సమర్పించారు. గొలగమూడి గ్రామస్తులసే ఉదయము రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి నిర్వహించు శ్రీ విఘ్నేశ్వర నృత్య కేతన వారిచే, నుడాదూరు విజయలక్ష్మి బృందం ఆధ్వర్యంలో కూచిపూడి , జానపద కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ఆరాధన ఉత్సవాల్లో** నేడు సూర్యప్రభ వాహన సేవను నిర్వహించనున్నారు. ఉభయకర్తలుగా. సన్నారెడ్డి కృష్ణారెడ్డి నాయుడుపేట. రాత్రి నిర్వహించనున్న చంద్రప్రభ వాహన సేవకు ఉభయకర్తలగా ఆల్తూరి గిరీష్ రెడ్డి, లతా, ఆల్తూరి మహేష్ రెడ్డి, రాధిక, వ్యవహరించునున్నారు

## కల్లు గీత కార్మికుల కు ప్రత్యేకంగా 5 మద్యం షాపులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 18, ప్రభాతవార్త** ప్రభుత్వ ఆదేశాల మేరకు కల్లు గీత కార్మికుల సంక్షేమార్ధం జిల్లాలో వారికి ప్రత్యేకంగా 5 మద్యం షాపులు కేటాయించినట్టు జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో జిల్లాకు మంజూరైన 5 షాపులకు కల్లు గీత కార్మికుల్లోని ఉప కులాలకు షాపులను లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ కేటాయించారు. ఈ లాటరీ లో గమల్ల కులానికి కావలి మున్సిపాలిటీ, గౌడ కులానికి కందుకూరు మున్సిపాలిటీ మరియు అలూరు నగర పంచాయతీ, గౌడ్ కులానికి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ లోని రెండు షాపులు కేటాయించారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ సమితి నాయకుల పరిశీలనలో పూర్తి పారదర్శకంగా లాటరీ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమం కొరకు ప్రభుత్వం వారికోసమే జిల్లాలో ప్రత్యేకంగా మద్యం షాపులు కేటాయించారన్నారు. ఆయా కులాలలోని ఉప కులాలకు లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయించడం జరిగిందన్నారు. ఉప కులాలకు కేటాయించిన షాపుల వివరాలతో కూడిన నివేదిక ను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల ఏర్పాటు కొరకు ఆయా ఉపకులాలలోని ఔత్సాహికుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా షాపుల లైసెన్స్ ఫీజులో వారికి 50 శాతం రాయితీ కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య, గీత కార్మికుల సంక్షేమ నాయకులు రామ్ ప్రసాద్, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనాపై పోరుకు పలువురి ప్రశంసలు

**- డాక్టర్ పోకల రవిని అభినందించిన జనసేన పార్టీ నేత గురుకుల కిషోర్**



**నెల్లూరు, ఆగష్టు 18, ప్రభాతవార్త - వైద్యం** ప్రపంచమంతా కరోనా రక్కసి కోరల్లో చిక్కుకుని విలవిలాడుతున్న సమయంలో నేనున్నానంటూ గుండె ధైర్యంతో ముందుకొచ్చి కరోనా బాధితులకు చక్కటి వైద్య సేవలు అందించిన డెల్టా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పోకల రవి సేవలు ఎంతో అమోఘం నెల్లూరు జిల్లాలో కరోనా భారిన పడి చావు బతుకుల సమస్యతో కొట్టుమిట్లాడుతున్న రోగులను అక్కున చేర్చుకొని వైద్య సేవలు అందించారని, డాక్టర్ ఎంతో మందికి ప్రాణదానం చేసిన ఈ వైద్యుడికి అందరూ చేతులెత్తి మొక్కుతున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కరోనా సమయంలో చేసిన సేవలకు గాను డెల్టా హాస్పిటల్స్ అధినేత ప్రముఖ డాక్టర్ పోకల రవికి, గవర్నర్ గారి నుంచి తేనీటి విందుకు ఆహ్వానం అందిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన చేసిన విశిష్ట సేవలను మరొక్క సారి గుర్తు చేసుకుంటూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఆయన సతీమణి విజయలక్ష్మీ, డాక్టర్ పోకల రవిని కలిసి ఘనంగా సత్కరించారు. మీ సేవలను జిల్లా ప్రజలు మరువరని కొనియాడారు. ఈ కోవలో ఆయనకు అనేక మంది నుంచి అభినందనలు అందుతున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ, వీర మహిళ ప్రవల్లిక, సీనియర్ జనసేన నాయకుడు బెల్లపు సుధా మాధవ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రవాంత్ గౌడ్, నగర కార్యదర్శి హేమచంద్ర యాదవ్, మౌనిష్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## వవ్వేరు బ్యాంకు చైర్‌పర్సన్
## దొడ్ల విజయలక్ష్మీని సన్మానించిన బ్యాంకు సిబ్బంది



**బుచ్చి ఆగష్టు 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం లోని వవ్వేరుబ్యాంకు చైర్‌పర్సన్ దొడ్లవిజయలక్ష్మీ , దొడ్ల కోదండరామిరెడ్డిని బ్యాంకు సిబ్బందిశా లువాలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మా నించారు. డైరక్టర్లు మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మనిశాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. బ్యాంకు సిఐఒ మన్నారపు శ్రీనివాసులు, బ్యాంకు సిబ్బంది ప్రత్యేకంగా కేకుకట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మీమాట్లాడుతు పాలకమండలి, బ్యాంకు సిబ్బంది అందరం అంకిత భావంతో పనిచేసి మనపైన ఎంతో నమ్మకాన్ని పెట్టుకున్న కోవూరు శా సనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మంచి పేరు తీసుకొని రావాలని ఆమె సూచించారు.బ్యాంకు కి కీలమైనవారు రైతులు వారి అభ్యున్నతికి పూర్తిస్థాయిలో కృషిచేద్దామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాలొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు సిఐఒ సురేష్‌రెడ్డి చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మీ ,కోదండరామిరెడ్డి దం పతులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.

## కలిగిరి పిఎసియస్ అధ్యక్షులుగా కదిరి రంగారావు ప్రమాణ స్వీకారం



**కలిగిరి, ఆగష్టు18, ప్రభాతవార్త;** మండల కేంద్రమైన కలిగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులుగా కదిరి రంగారావు సోమ వారం పదవీబాధ్యతలు తీసుకు న్నారు. బిజెపి ఉదయగిరి ఇన్ ఛార్జీగా ఉన్న రంగారావుకు కూటమి ప్రభుత్వం పొత్తులో భాగంగా ఈపదవీ బిజెపికి కట్టబెట్టింది. సహకార సంఘ అధ్యక్షులుగా రంగారావు, డైక్టర్లుగా సోముభాస్కర్‌రెడ్డి,కమ్మ వారి పాళెంకు చెందిన గన్నమనేని శ్రీనివాసులు ప్రమాణశ్వీకారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరినీ కలుపుకొని పాలన సాగిస్తుందనడంలో తమకు ఈ బాధ్యతలు కల్పించడమేనన్నారు. తనకు అప్పగించిన భాద్యతను చిత్త సుద్ధితో నిర్వహిస్తానని రైతులకు అవసరమైన ఉరువులు, విత్తనాలు, రైతులకు వ్యవసాయ రుణాలు సకాలంలో అందించేవిదంగా తనవంతు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో తనకు ఈబాధ్యతను అప్పగించిన ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ గారికి రుణపడి ఉంటానని తెలుగుదేశం, జనసేన, బిజెపి సభ్యులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలుతునానన్నారు. కాగా పిఎసియస్ అధ్యక్షులుగా ప్రమాణ శ్వీకారం చేసిన అధ్యక్షులు డైరక్టర్లను పలువురు ఘనంగా సన్మారనించారు. ఈకార్యక్రమంలోకూటమి నాయకులు బిజ్జంక్రిష్ణా రెడ్డి, చీమల తాతయ్య,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులిచర్ల వెంకట నారాయణ రెడ్డి,మేకపాటి మాల్యాద్రినాయుడు,అంద్రా పరందామిరెడ్డి, సిఇఒ మానస లెక్కల వెంగళ్లరెడ్డి,డేగా మధు, ఆవుల రోశయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆధార్ స్పెషల్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి



**చేజర్ల ఆగష్టు 18 ప్రభాతవార్త** చేజర్ల మండలంలో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అమర్ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా ఈనెల 19 నుండి 30 వరకు వివిధ గ్రామ సచివాలయాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగష్టు 19 నుండి 21 వరకు తూర్పుపల్లి,ఏటూరు సచివాలయాల్లో, 22 నుండి 23 వరకు పాడేరు ఆదూరుపల్లి సచివాలయాలలో ,28 నుండి 29 వరకు పాతపాడు,వావిలేరు సచివాయాలల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు నూతన ఆదార్ కార్డులు, బయోమెట్రిక్ అప్డేట్ సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## నిర్వహణ భారం నియంత్రణకు విద్యుత్ ఉప కేంద్రాల్లో ఫోర్ ఇన్ వన్ డీసీ యూనిట్

**- వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కొరకే ఈ యూనిట్**

**- ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ నెల్లూరు ఎం.శ్రీధర్**



**నెల్లూరు, ఆగష్టు 18, ప్రభాతవార్త -వైద్యం** విద్యుత్ ఉప కేంద్రాల నిర్వహణ భారం తగ్గించుకోవడంతో పాటు ప్రమాదాల నివారించేందుకు బ్యాటరీల స్థానంలో ఫోర్ ఇన్ వన్ డీసీ యూనిట్‌ను సబ్ స్టేషన్‌లలో అమరుస్తున్నట్లు నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలిపారు. నెల్లూరు టౌన్‌కు మూడు ఫోర్- ఇన్- వన్ డీసీ యంత్రాలను ఏపీఎస్పీడీసీఎల్ వారు పంపించడం జరిగిందని ప్రయోగాత్మకంగా కొండయపాలెం, బీవీ నగర్, రేబాల వీధి సబ్ స్టేషన్స్‌లో ఏర్పాటు చేసి ఈ రోజు ఛార్జింగ్ చేసినట్లు తెలిపారు. ప్రతి ఉప కేంద్రంలో సాధారణంగా 5 నుండి 6 బ్యాటరీలు ఉంటాయి వీటి నిర్వహణ సంస్థకు పెనుభారంగా మారింది ఈ పక్షన్ ఇన్ వన్ డీసీ వపర్ యంత్రంతో బ్యాటరీలకు సంబంధం లేకుండా నేరుగా బ్రేకర్లకు విద్యుత్ ఛార్జింగ్ అవుతుంది. జిల్లాలో ప్రయోగాత్మకంగా వినియోగదారులకు నిరంతర మెరుగైన విద్యుత్ కోసం టౌన్‌లో ఏర్పాటు చేశామని దీని పనితనం చూసి తొందరలోనే అన్ని సబ్ స్టేషన్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ ఏ.అశోక్, వి.సుప్రియ, అసిస్టెంట్ ఇంజనీర్స్, దామోదర్‌రెడ్డి, లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

## బుచ్చి రూరల్ బ్యాంకు డైరక్టర్‌ని మాచవరంని సన్మానించిన బిజెపి నాయకులు



**బుచ్చి ఆగష్టు 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు డైరక్టర్ సీనియర్ బిజెపి నాయకులు మాచవరం శ్రీనివాసులును బిజెపి నాయకులు గండి రఘురామయ్య, గంజం పెంచల ప్రసాద్, తదితరులు శాలువా కప్పిపూలమాలలు వేసి సన్మా నించారు. ఈ సందర్భంగా డైరక్టర్ మాచవరం శ్రీనివాసులు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి, జిల్లా బిజెపి అధ్యక్షులు వంశీదర్‌రెడ్డికి, బుచ్చిరెడ్డిపాళెం టౌన్, రూరల్ కూటమి నాయకులకు ప్ర త్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు కోడవలూరు పరమార్శ

**రాపూరు,ఆగష్టు18ప్రభాతవార్త** ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీదర్‌ను సోమ వారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి కొడ వలూరు ధనుంజయ రెడ్డి పరమా ర్శించారు. గత వారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తండ్రి మేరిగ ఆనంధ రావు మృతి చెందారు. దీంతో రాపూ రులోని మేరిగ నివాసానికి వచ్చిన కొడవలూరు ధనుంజయ రెడ్డి మురళీ ధర్‌ను పరామర్శించి, ఆయన తండ్రి మృతి పట్ల సంతాపం తెలిపారు. వీరితో పాటు నెల్లూరు మేయర్ భర్త జయవర్ధన్ సైతం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ను పరమార్శించారు. ధనుంజయ రెడ్డి వెంట నాయకులు బాబు రెడ్డి, కోటా రెడ్డి, జడ్పీటీసి కోటయ్య, గూడురు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.